తళుక్కుమనేలా రహదారులు

నాడు

కంచరపాలెం వై జంక్షన్ నుంచి మర్రిపాలెం రైల్వే స్టేషన్ కూడలి వరకు గల బీఆర్‌టీఎస్ రహదారి గోతులమయంగా ఉండేది. ఏన్నో ఏళ్లుగా ట్రాఫిక్ సిగ్నెల్స్ దిష్టిబొమ్మల్లా దర్శనమిచ్చేవి. బారికేడ్లు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడేవారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ సమస్యలను గాలికొదిలేసింది.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి సుందరంగా మారింది. అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులతో రహదారులు అందంగా కనిపిస్తున్నాయి. ఏళ్ల నాటి ట్రాఫిక్ సిగ్నెల్స్ సమస్యకు మోక్షం లభించింది. బీఆర్‌టీఎస్ కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. పాదచారులు, వాహన చోదకులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు.

- రూ.3.20 కోట్లతో బీఆర్‌టీఎస్ రోడ్ల అభివృద్ధి
- అధ్వాన స్థితి నుంచి ఆధునికీకరణ
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు
- స్థానికులు, వాహన చోదకుల హర్షం


కంచరపాలెంలో నిర్మిస్తున్న బీటీ రోడ్డు

కంచరపాలెం: బీఆర్‌టీఎస్ రహదారులను తళుక్కుమనేలా తీర్చిదిద్దుతున్నారు. కంచరపాలెం వై జంక్షన్ నుంచి ఎన్ఏడీ వరకు బీఆర్‌టీఎస్ రహదారితోపాటు బీటీ రోడ్లు ఆధునికీకరణకు నోచుకున్నాయి. జీవీఎంసీ జోన్–5 పరిధిలో ఇంజినీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో నాణ్యమైన తారురోడ్లు నిర్మిస్తున్నారు. కంచరపాలెం, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా, జ్ఞానాపురం ప్రాంతాల్లో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. గతంలో బీఆర్‌టీఎస్ రహదారులు గోతులతో నిండి అధ్వానంగా ఉండేవి. అనేక రోడ్డు ప్రమాదాలు సంభవించేవి. వీటికి పరిష్కార మార్గం చూపుతూ సుమారు రూ.2.90 కోట్ల వ్యయంతో బీటీ రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, డివైడర్లు, ట్రాఫిక్ సిగ్నెల్స్, బారికేడ్ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు నిర్వహించారు. జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఇంజినీరింగ్ ఈఈలు ప్రసన్నరెడ్డి, శ్రీనివాసరావు, కంచరపాలెం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావుల నేతృత్వంలో ఇక్కడి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రహదారుల అభివృద్ధికి, ట్రాఫిక్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీ, జీవీఎంసీ నిధుల నుంచి రూ.3 కోట్ల మంజూరు కావడంతో పనులకు శ్రీకారం చుట్టారు.

చురుగ్గా పనులు

జ్ఞానాపురం నుంచి కంచరపాలెం మీదుగా ఎన్ఏడీ కొత్త రోడ్డు వరకు బీఆర్‌టీఎస్ మార్గంలో తారు(బీటీ) రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటి నిర్మాణం పూర్తయిన చోట ట్రాఫిక్ సిగ్నెల్స్, జీబ్రా క్రాసింగ్, స్పీడ్ బ్రేకర్లు, డిజిటల్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. బీఆర్‌టీఎస్‌లో పలు జంక్షన్ల వద్ద బారికేడ్లు, కారిడార్లు, ఫుట్‌పాత్‌లకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే సుమారు రూ.3.20 కోట్లతో చేపట్టిన పనులు పూర్తికాగా.. మరో రూ.90 లక్షల పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. బీఆర్‌టీఎస్ రహదారుల్లోని సమస్యలు పరిష్కారం కావడం, అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుండటంతో స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




సుందరంగా కంచరపాలెం వై జంక్షన్


కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం వెళ్లేందుకు వై జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లు

కంచరపాలెం – మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో చేపట్టిన పనులు, వ్యయం

బీటీ రోడ్లు	రూ.2.52 కోట్లు
డివైడర్లు	రూ.28.98 లక్షలు
ట్రాఫిక్ సిగ్నెల్స్ ఏర్పాటు	రూ.16.85 లక్షలు
సిగ్నెల్స్ లైట్లు-రంగులు	రూ.16.93లక్షలు
స్పీడ్ బ్రేకర్లు(రబ్బర్ లైట్లు)	రూ.14.80 లక్షలు
ఫుట్‌పాత్‌లు-టైల్స్	రూ.9.78 లక్షలు
బారికేడ్లు	రూ.15.80 లక్షలు
జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు-రంగులు	రూ.17.53 లక్షలు


ఐటీఐ జంక్షన్ బీటీ రోడ్డులో ఏర్పాటు చేసిన జీబ్రా క్రాసింగ్, డివైడర్లు

బీఆర్‌టీఎస్‌లో సాఫీగా రాకపోకలు



కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారులు గుంతలతో నిండి ఉండేవి. వాటిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. బీటీ రోడ్లు, జీబ్రా క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్‌లు, ట్రాఫిక్ సిగ్నెల్స్ ఏర్పాటు చేశారు. నేడు బీఆర్‌టీఎస్ రహదారుల్లో పాదచారులు, వాహన చోదకులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు.

– జి.సాయి ఏసు, గవర కంచరపాలెం

రహదారులు బాగుపడుతున్నాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి చోటా అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. నిధులు పుష్కలంగా మంజూరు కావడంతో రహదారుల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రజలు ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు తొలగుతున్నాయి.

– పి.రమణ, దయానందనగర్

క్లుప్తంగా

లలితా పీఠంలో పాశుర విన్నపం


పాశుర విన్నపం చేస్తున్న అర్చకుడు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో నిర్వహిస్తున్న ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా ఆదివారం 9వ రోజు పాశుర విన్నపం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పాశురాలు చదివారు. ఈ సందర్భంగా గోదా దేవికి పంచామృతాభిషేకం, వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన జరిపారు. జనవరి 3న సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ ఉంటుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

నెఫ్రాలజీ, యూరాలజీ సమస్యలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఉదయ్

సీతంపేట: అక్కయ్యపాలెం అబిద్‌నగర్ పార్కులో ఆదివారం ఉదయం నెఫ్రాలజీ, యూరాలజీ అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ వైద్యులు ఉదయ్, రవీంద్రవర్మ, మేనేజర్ పృథ్వీనాయుడు నెఫ్రాలజీ, యూరాలజీ సమస్యలు ఏవిధంగా ఉంటాయి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అబిద్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎస్.వి.ఆర్.ప్రసాద్, జె.ఖాన్, ఎం.వెంకటరావు, వాకర్స్ పాల్గొన్నారు.

ఘనంగా 'ఘండికోట' జయంతి

సీతంపేట: విశాఖ సాహితి తొలి అధ్యక్షుడు ఘండికోట బ్రహ్మాజీరావు 101వ జయంతి వేడుకలు ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 2023 సంవత్సరానికి ఘండికోట బ్రహ్మజీరావు, సీతారామ స్మారక సాహితీ పురస్కారాన్ని కథకుడు జయంతి ప్రకాశశర్మకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశాఖ సాహితి ఉపాధ్యక్షులు కందాళ కనకమహాలక్ష్మి, ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, డి.వి.సూర్యారావు, ఘండికోట విశ్వనాథం పాల్గొన్నారు.

క్రికెట్, త్రోబాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెవరెండ్ ఫాదర్ జాన్‌ప్రకాష్, నిఖిలేష్ రాజ్‌కుమార్

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి గ్రౌండ్‌లో సెయింట్ మదర్ థెరిస్సా మెమోరియల్ స్పోర్ట్స్ టోర్నమెంట్ పేరిట వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సీనియర్ నాయకుడు యాండ్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రికెట్–త్రోబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్‌సీఎం విశాఖ ఛాన్సలర్, రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ పోస్టర్ ఆవిష్కరించారు. జనవరి 28 వరకు జరిగే పోటీల్లో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని సుమారు 22 చర్చిలు, 25 విద్యా సంస్థల క్రీడాకారులు పాల్గొంటారని ఫాదర్లు శివం విజయ భాస్కర్, ప్రభాకర్ తెలిపారు. జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యురాలు యాండ్రపు ఫాతిమారాణి, సీహెచ్ విజయకుమార్, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన నృత్యోత్సవాలు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల నృత్యోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు ఆదివారం ప్రదర్శించిన జానపద నృత్య వైభవం అందరిని కట్టిపడేసింది. నవ చైతన్య కళా సమితి నుంచి 60 మంది జానపద కళాకారులు పలు నృత్య రీతులను 90 నిమిషాల పాటు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

గెడ్డల పరిరక్షణకు సమష్టి కృషి


సదస్సులో పాల్గొన్న ఫోరం ప్రతినిధులు

సీతంపేట: విశాఖలో సహజ సిద్ధమైన నీటి గెడ్డల పరిరక్షణకు ప్రభుత్వం, పౌరసమాజం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని గ్రేటర్ విశాఖపట్నం సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం 'విశాఖపట్నంలో నీటి గెడ్డలు, సమస్యలు, పరిష్కార మార్గాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆర్కిటెక్ట్ షబ్నం పటేల్ 'విశాఖలో సహజ నీటి ప్రవాహ వ్యవస్థల సుస్థిర యాజమాన్యం' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విశాఖలో సహజమైన నీటి కాలువలు సముద్రంలో కలుస్తాయని, ఈ ప్రక్రియ వర్షాల సమయంలో నగర ప్రకృతి దృశ్యాన్ని పొడిగా ఉంచడంలో సహాయ పడుతుందని షబ్నం తెలిపారు. పెరుగుతున్న జనాభా సాంద్రత, పట్టణీకరణ కారణంగా నీటి కాలువలు సాధారణ వ్యర్థ కాలువలుగా మారాయన్నారు. సదస్సులో పలు తీర్మానాలు చేశారు. గెడ్డల ద్వారా సముద్రంలో చేరే వ్యర్థాల పరిమాణాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. సముద్రంలోకి విడుదలయ్యే ముందు మురుగు నీటిని శుభ్రపరిచే విషయంలో అత్యంత ప్రాధాన్యమివ్వాలని తీర్మానించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, ఫోరం అధ్యక్షుడు లెఫ్టినెంట్ కల్నల్ ఎ.కె.సుబ్బారావు, ఉపాధ్యక్షుడు సోహన్ హటంగడి, కార్యదర్శి ఎస్.విశ్వనాథన్, ఎస్.వి.సుబ్రహ్మణ్యం, కె.కామరాజు, కె.ఎస్.ఎస్.నాయుడు, ఎ.రమేష్, ఎస్.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గోడ ఎలివేషన్ కూలడంపై ఆరా


గోడ కూలిన ప్రాంతంలో పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ దరి వాంబే కాలనీలో శనివారం రాత్రి నాలుగో అంతస్తులో ఇంటి గోడ ఎలివేషన్ ఒక్కసారిగా కింద పడిపోయింది. రాత్రి కావడంతో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ఇబ్బంది జరగలేదు. స్థానికులు, అక్కడున్న పార్టీ కార్యకర్తలు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. ఆయన ఆదివారం ఉదయం సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సమస్యను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ కమిషనర్, కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఐకమత్యంతోనే పెన్షన్ సాధన


సనపల బంగారురాజును సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

మర్రిపాలెం: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పెన్షనర్లు రోడ్డున పడుతున్నారని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ మసేను అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు చౌదరి అప్పారావు అధ్యక్షతన ఆదివారం మాధవధార తోటల్లో సర్వసభ్య సమావేశం, వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ విశాఖ పోర్టు బెర్తులను ముక్కలుగా చేసి ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం యోచిస్తోందని, తక్షణమే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పింఛన్‌దారులకు కూడా భవిష్యత్తులో పెన్షన్ లేకుండా చేసేందుకు పోర్టు యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆరోపించారు. అందరూ కలిసి కట్టుగా ఉంటేనే పెన్షన్‌ను సాధించుకోవచ్చన్నారు. పోర్టు ఆస్పత్రి స్థలాన్ని కార్పొరేట్ శక్తులకు చౌకగా అమ్మేస్తున్నారని, దీని వల్ల వైద్యం కార్పొరేట్ శక్తుల చేతికి వెళ్లి తద్వారా పింఛన్‌దారులపై భారం పడుతుందని చెప్పారు. పెన్షనర్లు వీటిని వ్యతిరేకించాలన్నారు. అసోసియేషన్ చైర్మన్ సనపల బంగారురాజు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నెపు నారాయణరావు, కార్యదర్శి పి.ఎస్.ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు వేళాయె..



క్రైస్ట్ గాస్పల్ చర్చిలో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు


విద్యుద్దీపాలంకరణలో సాలగ్రామపురం క్రైస్ట్ గాస్పల్ చర్చి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42, 45 వార్డుల్లోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. సోమవారం ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ఆరాధనలు జరగనున్నాయి. 45వ వార్డు సాలగ్రామపురం దరి వరాహగిరి కాలనీలోని క్రైస్ట్ గాస్పల్ చర్చిలో ఆదివారం చిన్నారులు, యువత ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పలు గీతాలతో, వీనుల విందైన సంగీతంతో, లఘు నాటికలను, క్రీస్తు జనన విధానం గురించి తెలిపే క్రిస్మస్ స్కిట్లు ప్రదర్శించారు. చిన్నారులు, యువత సంప్రదాయ బద్ధమైన నాట్యాలతో, కొరియోగ్రఫీలతో విశ్వాసులను, స్థానికులను మైమరచిపోయేలా చేశారు. చర్చిని అందంగా ముస్తాబు చేశారు. కార్యక్రమాల్లో పాస్టర్ ఎస్.మోహనరావు, చర్చి యువత, చిన్నారులు, విశ్వాసులు, స్థానికులు పాల్గొన్నారు.


ఉత్సాహంగా చిల్డ్రన్ క్రిస్మస్

సీతంపేట: సత్యం కూడలి వద్ద ఉన్న బేతెల్ అసెంబ్లీ చర్చిలో ఆదివారం రాత్రి చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏసుక్రీస్తును స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. క్రీస్తు జననం, క్రీస్తు బోధనలపై ప్రదర్శించిన స్కిట్లు ఆకట్టుకున్నాయి. కంఠస్థ వాక్యాలు చదివి వినిపించారు. చర్చి నిర్వాహకులు నిర్వహించిన ఫన్ గేమ్స్‌లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. చర్చి పాస్టర్ గండి జాన్ సుందర్‌కుమార్, నిర్వాహకుడు రవికుమార్ క్రిస్మస్ సందేశానిచ్చారు. చర్చిలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని తెలిపారు.

కారుచీకట్లో కాంతిరేఖలా క్రీస్తు జననం

కంచరపాలెం: ఏసు ప్రపంచానికి వెలుగు ప్రసాదించే ప్రభువని, అంధకారంలో నడిచే వారికి కాంతిరేఖగా నిలుస్తారని రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ పేర్కొన్నారు. ఆదివారం అర్ధరాత్రి జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. క్రీస్తు ప్రవచించిన సర్వమానవ సమానత్వాన్ని అందరూ అలవర్చుకోవాలని ఉద్బోధించారు. అంతకు ముందు దివ్య బలిపూజ సమర్పణ, ప్రత్యేక ప్రార్థనలు, క్రిస్మస్ కేరల్స్, ఆధ్యాత్మిక ప్రసంగాలు, దైవ సందేశం, క్రిస్మస్ పాటలు, నృత్యాలు, సంగీత విభావరి నిర్వహించారు. అనంతరం క్రీస్తు జన్మించిన పశువుల పాకను భక్తులు దర్శించారు. సోమవారం జరిగే ప్రార్థనా కార్యక్రమాలను పారిష్ పాస్టిల్ కౌన్సిల్ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.


బేతెల్ అసెంబ్లీ చర్చిలో గీతాలు ఆలపిస్తున్న పిల్లలు


విద్యుత్ అలంకరణలో పునీత పేతురు చర్చి

వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హారిక

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడ మణి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ హారిక నేతృత్వంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ట్రస్ట్ ఫౌండర్ ఎస్.కె.రత్నం మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్యం, వస్త్రాలు అందించాలనే భావంతో ట్రస్ట్ స్థాపించినట్లు తెలిపారు. సుమారు 259 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు ట్రస్ట్ సభ్యులు చెప్పారు. వైద్యులు వెంకట్, మహాలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు కిషోర్‌కుమార్, గోవింద్, బాలమురళీకృష్ణ, అజయ్‌కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హాస్య నాటికలు

సీతంపేట: హాస్య దర్బార్ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోద లహరి కార్యక్రమం అలరించింది. కడుపుబ్బా నవ్వించే జోకులు, స్కిట్లతో హాస్య దర్బార్ కళాకారులు ప్రేక్షకులను నవ్వించారు. కార్యక్రమంలో ఎస్.సూర్యారావు నాయుడు, కోరుకొండ రంగారావు, జి.వి.త్రినాథ్, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడికి ప్రత్యేక పూజలు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాల మధ్య అర్చకులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేయించిన అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరఫున శ్రీరంగనాథుడికి 8వ పాశుర విన్నపం వినిపించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు పాశుర విన్నపం ప్రాధాన్యాన్ని వివరించారు. ఆలయ ఈవో బందారు ప్రసాద్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శివయ్యకు రుద్రాభిషేకం


అభిషేకం చేస్తున్న రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు భీమ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఆదివారం 65వ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సత్యసాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ చేతుల మీదుగా శివయ్యకు అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులకు ఆయన అన్నప్రసాదం వడ్డించారు. కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు



నందికి పూజలు చేస్తున్న రాజాస్వామి

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఆదివారం శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో త్రయోదశి ప్రదోషకాల పూజలు జరిపారు. పంచామృతాభిషేకం, నెయ్యి, పాలు, గంధంతో అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

దత్త జయంతి రేపు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 26న దత్త జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక హారతులు, పూజలు, హోమాలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల సందడి


సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

దాబాగార్డెన్స్: సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1988 పదో తరగతి బ్యాచ్) ఆదివారం సందడి చేశారు. విశాఖతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకుని ముచ్చటించారు. వీరంతా ముడసర్లోవలో కలుసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంజాయ్ చేశారు.

సింహాచలానికి అయ్యప్పస్వాముల పాదయాత్ర


పాదయాత్రగా సింహాచలం కొండను చేరుకున్న అయ్యప్ప స్వాములు

మురళీనగర్: మురళీనగర్ శ్రీమణికంఠ సేవా సంఘం ఆధ్వర్యంలో మురళీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారులు ఆదివారం సింహాచలం దేవస్థానానికి పాదయాత్ర చేశారు. 35 మంది స్వాములు మాధవధార నుంచి ఉదయం బయలు దేరి కొండ మెట్ల మార్గం ద్వారా వెళ్లి సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. వీరు తాడేపల్లి అప్పయ్యశాస్త్రి గురుస్వామి ఆధ్వర్యంలో ఈ నడక యాత్ర చేశారు. మార్గం మధ్యలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. సేవా సంఘం ప్రతినిధులు గణపతి రావు, ఆనంద్, సురేష్, లక్ష్మీరావు, నాగంద్ర స్వాములు పాల్గొన్నారు.